క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సరూర్‌నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ కమలానగర్, నేతాజీనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యారంగానికి మొండిచేయి

హుడాకాంప్లెక్స్: వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం మాదిరిగానే విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి మొండి చేయి చూపించిందని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు వై.కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం 2.53 శాతం నిధులు మాత్రమే విద్యారంగానికి కేటాయించడం దురదృష్టకరమన్నారు. ఈ నిధులతో పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య ఎలా అందివ్వగులుగుతారని ప్రశ్నించారు. ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాల్సిన పాలకులు దాని నుంచి దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

న్యూ నందిహిల్స్ ఫేజ్-1 కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మీర్‌పేట: న్యూ నందిహిల్స్ ఫేజ్-1 మిడిల్ కాలనీ అసోసియేషన్ ఫేజ్-1 (రోడ్ నెం-1 నుంచి 6 వరకు) నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం.సూర్యనారాయణ, అధ్యక్షుడిగా చల్లా శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.రఘునాథ్‌రెడ్డి, కోశాధికారిగా డి.ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా ఏ.జానయ్య పటేల్, గిరిధర్, ఎం.రవీంద్ర ముదిరాజ్, సహాయ కార్యదర్శులుగా మోనాచారి, ఎల్.రవికిరణ్, పురుషోత్తం, గౌరవ సలహాదారులుగా సామ భాస్కర్‌రెడ్డి, జే.బాల్‌రాజు, రఘుమారెడ్డి, కుప్‌సింగ్, కే.నర్సింహారెడ్డి, సభ్యులుగా పి.గోవిందు, రాందేవ్, శివరాజ్, నరేశ్, రాంబాబు ఎన్నికయ్యారు.

8 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ఆలయంలో వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ఈనెల 8 నుంచి 14 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్లను నిర్వాహకులు, స్థానిక నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్, బిచ్యానాయక్, రామకృష్ణ, వెంకటేశ్, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, చందోజీ, సాయిరెడ్డి, వెంకటయ్య, బుచ్చయ్య, యాదయ్య, ఈట మోహన్‌రావ్‌లు ఆవిష్కరించారు. ఉత్సవాలలో భాగంగా 8న అంకురార్పణ, ధ్వజారోహనం, 9న అమ్మవారికి ప్రత్యేకపూజలు, లలితా సహస్రనామ పారాయణం, స్వామివారికి ఎదుర్కోలు, 10న చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం, 11న లక్ష పుష్పార్చన, ప్రత్యేక పూజలు, హోమం, 14న చక్రతీర్థంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

9 నుంచి వేణుగోపాలస్వామి జాతర

మంచాల: మండల పరిధిలోని ఆరుట్లలో ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు శ్రీ వేణుగోపాలస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు ఆరుట్లతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు చీరాల రమేశ్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్లేశ్, చంద్రయ్య, భాస్కర్, రాములు, బాషా, రఘుపతి, మా సయ్య, సురేష్, జానీ పాషా, రాజు, కుమార్, కృష్ణ, రమేశ్, పాల్గొన్నారు.

అడవి తల్లి.. గరిగుట్ట పెద్దమ్మ

- జాతరకు సిద్ధమైన జల్‌పల్లి గరిగుట్ట ఆలయం
- ఈ నెల 8 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు



గరిగుట్టపై ఉన్న పెద్దమ్మ ఆలయం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మాదన్నగూడలోని ప్రాచీనమైన గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారి ఆలయం కల్యాణ మహోత్సవాల(జాతర)కు సిద్ధమైంది. ఈ నెల 8వ తేదీ నుంచి మూడురోజుల పాటు కనుల పండువగా జరుగనున్న ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ఇప్పటికే ఆలయానికి రంగులద్దడంతో పాటు ఆలయానికి వచ్చే అటవీ ప్రాంతంలోని చెట్లను కూడా జాజు, సున్నంతో అలంకరించారు. వెరసి మాదన్నగూడ అటవీ ప్రాంతం ప్రత్యేక ఆకర్షణీయతను సంతరించుకుంది. ఈ జాతరకు జల్‌పల్లి గ్రామంతో పాటు శ్రీరాంకాలనీ, మామిడిపల్లి, పహాడీషరీఫ్, చాంద్రాయణగుట్ట, సరూర్‌నగర్, బాలాపూర్, శాతంరాయి, కాటేదాన్, మధుబన్ కాలనీ, గగన్‌పహాడ్‌ల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు.

దట్టమైన అడవిలో అమ్మవారు..

జల్‌పల్లి గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో దట్టమైన మాదన్నగూడ అటవీ ప్రాంతంలో గరిగుట్టపై పెద్దమ్మ అమ్మవారు కొలువుదీరారు. భారీ వనసంపద నడుమ వెలసిన ఈ ఆలయంలో అమ్మవారితో పాటు ఆలయ కుడిభాగంలోనే కొద్ది దూరంలో సమ్మక్క, సారక్కల గద్దెలు నెలకొల్పబడ్డాయి. అడవులకు రక్షణగా ఈ అమ్మవార్ల గద్దెలను ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. అమ్మవారి ఆలయ కుడి భాగంలో కొండపైన ఆంజనేయ స్వామి విగ్రహం ఉంది. దీనికి సమీపంలోనే కొండలపై రెండు గుండంలు(కోనేరు)లు ఉన్నాయి. ప్రతీ అమవాస్య, పౌర్ణమి రోజున ఇక్కడ ప్రత్యేక పూజలు జరగగా.. ఏడాదికోమారు ఉత్సవాలు జరుగుతాయి. స్వర్గీయ కరన్‌కోట కిషన్ బాబా తమ పెద్దల నుంచి వారసత్వంగా తీసుకొని ఆలయంలో పూజలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన కుమారుడు విఠల్ బాబా మూడు దశాబ్దాల నుంచి పర్యవేక్షిస్తున్నారు.



ఆలయానికి వెళ్లే మార్గంలో చెట్లకు రంగులతో అలంకరణ



ఆలయ సన్నిధిలో సమ్మక్క, సారమ్మల దిమ్మెలు

మాదన్న కాలంలో అమ్మవారి ఆలయ నిర్మాణం

తానీషా హయాంలో ఉన్నత పదవిలో కొనసాగిన మహేశ్వరం ప్రాంత వాసి మాదన్న ఈ అటవీ ప్రాంతం నుంచి వెళ్లే క్రమంలో శిబిరంలో నిద్రిస్తుండగా అమ్మవారు కలలో ప్రత్యక్షమై ఆదేశించడంతో అమ్మవారిని ప్రతిష్ఠించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈ ప్రాంతాన్ని మాదన్నగూడ అంటారని జల్‌పల్లి వాసులు చెబుతున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా జల్‌పల్లి గ్రామ ప్రజలు ఇంటి ఆడపడుచులు, బంధువులను ఆహ్వానించుకొని మూడురోజుల ఘనంగా ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

మూడురోజుల పాటు ఉత్సవాలు



గరిగుట్ట పెద్దమ్మ ఉత్సవాలు ఫిబ్రవరి 8వ తేదీ నుంచి మూడురోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నాం. తొలిరోజు శనివారం అమ్మవారికి అభిషేకం, పుట్ట బంగారం కమ్ముట, గంగ పూజ, రాత్రి 9 గంటల నుంచి పెద్దమ్మ తల్లి ఒగ్గు కథ ఉంటుంది. 9వ తేదీన ఆదివారం తొట్టెల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపు, సాయంత్రం 4 గంటలకు ఒడిబియ్యం సమర్పణ నిర్వహిస్తాం. 10వ తేదీన అగ్నిగుండాల ప్రవేశం, సదరు పటం, అన్నదానం, సాయంత్రం అమ్మవారి కల్యాణం జరుగుతుంది. అటవీ శాఖా అధికారులు తమకు పూర్తిస్థాయిలో సహకరించాలి.

– కరన్‌కోట్ విఠల్ బాబా, ఆలయ ధర్మకర్త

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు



గరిగుట్ట జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. కౌన్సిల్ ఆమోదంతో నిర్వహణ కోసం ఇప్పటికే రూ.3లక్షలు మంజూరు చేశాం. అటవీ ప్రాంతంలో ఉన్న ఆలయానికి మట్టి రహదారి మాత్రమే మొరంతో గోతులు పూడుస్తున్నాం. మూడురోజుల పాటు పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి సమస్య లేకుండా చూస్తా. విద్యుత్ సదుపాయంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని కూడా సమకూరుస్తాం. అడవికి నిప్పంటుకోకుండా భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– వెంకట్రామ్, జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

స్థానిక ఎన్నిలకు కాంగ్రెస్ దూరం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: ప్రజల నుంచి వ్యతిరేకత ఎక్కువవుతుండడంతో ఓడిపోతామనే భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఘాటుగా విమర్శించారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ శ్రీశ్రీహోమ్స్ కాలనీలో ఓపెన్ జిమ్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు, ప్రజలు కాంగ్రెస్ పార్టీపై భగ్గుమంటున్నారన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించినా ఘోరంగా ఓడిపోతామనే భయం కాంగ్రెస్ పార్టీకి పట్టిందన్నారు. రైతుబంధు పేరుతో రైతులకు ఆశలు చూపించి నిలువునా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆరుగ్యారంటీల పేరుతో 420 హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. అన్ని శాఖలు ఆయన(సీఎం)వద్ద పెట్టుకొని ఏడాది పాలన గడిచినా ఇప్పటివరకు ఏ ఒక్క మున్సిపాలిటీలకు రూపాయి నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. మా నిధులతో మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్న స్థానిక కాంగ్రెస్ నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేయించాలని సవాల్ విసిరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ ఢంకా మోగిస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సంరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశ్రీహోమ్స్ కాలనీ అధ్యక్షుడు మల్గారి రంజిత్‌కుమార్‌గౌడ్, తుఫాన్ రెడ్డి, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన నాయకులు



ధర్నాకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు రిక్తహస్తం ఇవ్వడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్‌పై గల అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమానికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కందుకూరు, మహేశ్వరం మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణపై బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడం వివక్ష చూపడమేనన్నారు. కనీసం ముఖ్య ప్రాజెక్టులకు రిక్తహస్తం చూపడం ఏమిటని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నందిగామ నర్సింహ, షేక్ యాసఫ్‌ఖాద్రీ, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, రాజునాయక్, యాదయ్య, ఎం.రవికుమార్, పందుల వెంకట్‌గౌడ్, చేవంగి ప్రవీణ్, నడికూడి శివ, లాజర్, సుభాష్, వత్తుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు శుభాకాంక్షలు



మందకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాదిగ ఉద్యోగుల సంఘం నేతలు

యాచారం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ కమిటీ యాచారం మండలం ఆధ్వర్యంలో ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ నాయకత్వంలో మంద కృష్ణ మాదిగను కలిశారు. ఈ నెల 7న జరిగే లక్ష డప్పుల కార్యక్రమంలో మాదిగ ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కృష్ణ మాది గ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగ కమిటీ సభ్యులు తొట్ల యాదయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు సత్కారం



సంకటోనిపల్లిలో మాజీ కౌన్సిలర్ రాధమ్మ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కమటం రాధమ్మను సంకటోనిపల్లి అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఐదేళ్ల కౌన్సిలర్‌గా వార్డు అభివృద్ధికి, సంకటోనిపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేశారని సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు నిరంజన్, రామలింగయ్య, బాలరాజు, మహేశ్, మల్లేశ్, శేఖర్, చంద్రయ్య, యాదగిరి, రాజు, ఆచారి, నరేశ్, యాదయ్య, నర్సింహ, వెంకటయ్య, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

మంచాల: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని వీఆర్‌వన్ ఫౌండేషన్ అధినేత కుకుడాల వెంకటేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లపల్లిగూడలో గతంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 15 మందికి ఆపరేషన్లు చేయగా, 100 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. ఆదివారం ఈ మేరకు వారికి అద్దాలు పంపిణీ చేశారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షకు నిరసనగా టీపీసీసీ ఆధ్వర్యంలో హైద్రాబాద్ ట్యాంకు బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం చేపట్టిన కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మహేశ్వరం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపిందన్నారు. బడ్జెట్‌లో బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చి తెలంగాణకు గుండు సున్నా ఇచ్చిందని ఆరోపించారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. ఈ నిరసన కార్యక్రమానికి తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు నడికూడ శివ, మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు లాజర్, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు వత్తుల నారాయణ, సుభాష్ పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

'లక్షల డప్పుల'ను విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ మాదిగ

మహేశ్వరం: ఫిబ్రవరి 7న హైద్రాబాద్‌లో జరిగే వేల గొంతులు-లక్ష డప్పుల కార్యక్రమానికి ప్రతి మాదిగ హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగళ్ల ప్రశాంత్ మాదిగ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్-జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో హైద్రాబాద్ మహాప్రదర్శన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ గత 30 సంవత్సరాల నుంచి అలుపెరుగని పోరుచేసి మాదిగ జాతిని చైతన్యం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన మాల సామాజిక వర్గానికి చెందిన కొంత మంది స్వార్థపరులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మాలలు కుట్రలు, కుతంత్రాలు చేస్తూ సామాజిక న్యాయాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే మాలలకు దండోర డప్పులతోనే తగిన సమాధానం చెబుతామన్నారు. ఫిబ్రవరి 7న హైద్రాబాద్‌లో లక్షల డప్పుల చప్పుళ్లను వినిపించేందుకు ప్రతి మాదిగ, మాదిగ ఉప కులాలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బక్కని రవి మాదిగ, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు పెండ్యాల బాల్‌రాజ్, జంగయ్య, నవీన్, స్వామి, అఆర్జున్, మల్లేష్, శ్రీశైలం పలువురు పాల్గొన్నారు.

శెట్టిపల్లిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలోని శెట్టిపల్లి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 5 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటిరోజు విశ్వక్‌సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణం, ధ్వజారోహనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మక్తమాదారంలో..

కడ్తాల మండలం మక్తమాదారం గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండోరోజు ఆదివారం హోమం, ధ్వజారోహనం, బేరిపూజ, దేవత ఆహ్వానం, పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఎంపీటీసీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



శెట్టిపల్లిలో స్వామివారి సేవలో గ్రామస్తులు

వర్గీకరణ సాధించేవరకు పోరు



ఇబ్రహీంపట్నం రూరల్: వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు ప్రతాప్
- 'వేల గొంతులు-లక్ష డప్పులు' వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్సీల్లో ఏబీసీడీ వర్గీకరణ సాధించేవరకు పోరాటం ఆపేది లేదని బీజేపీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టబోయే వేల గొంతులు లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ సోదరులు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. డప్పు సప్పుడుకు ప్రభుత్వాలు దిగొచ్చి వర్గీకరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సతీష్, నాయకులు మహేశ్, సుధాకర్, ఉద్యోగ సంఘాల నాయకులు అయోధ్య, యాదయ్య, మల్లేశ్, బాబు, నర్సింహ, బాలరాజ్, జంగయ్య, అమరేందర్, నరేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మహాప్రదర్శన విజయవంతం చేయాలి

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో నిర్వహించే 'వేలగొంతులు లక్ష డప్పులు' మహాప్రదర్శనను విజయవంతం చేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడురి లక్ష్మీనర్సింహారెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్, మండల శాఖ అధ్యక్షుడు రమేశ్ కోరారు. ఆదివారం కడ్తాల మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహాప్రదర్శన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణను దేశంలో అందరికంటే ముందుగా అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, దానికి కట్టుబడి వెంటనే వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, లక్ష్మయ్య, లాయక్‌అలీ, పాండునాయక్, శ్రీకాంత్, నరేశ్, అశోక్, ముత్తికృష్ణ, కుమార్, జగన్, మహేశ్, అశోక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: కడ్తాల్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి కోరారని ఆయన గుర్తుచేశారు. అయినప్పటికీ కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిందన్నారు. మూడేళ్లుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి సరిగా నిధులు రావడం లేదని ఆరోపించారు. రాష్ట్రాలకు జనాభా నిష్పత్తిలో నిధులు కేటాయించాలని కోరినా కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు నిధులు కేటాయించి రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమి లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలీల్, నాయకులు ఖాదర్, ఖరీం, కృష్ణనాయక్, అలీం, ఫరీద్, నాజర్, మహేశ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.